క్లుప్తంగా

మదర్‌థెరిసా విద్యార్థిని ప్రతిభ


ప్రతిభ చాటిన దక్ష

పెద్దపంజాణి: మండలంలోని మదర్ థెరిసా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని హెచ్.దక్ష ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన యూసీ మాస్ అబాకస్ జాతీయస్థాయి పోటీల్లో తృతీయస్థానం సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థిని అభినందించి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు


విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న జడ్జి సలీమ్

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు విద్యార్థులు మూడు నగదు బహుమతులు సాధించినట్లు హెచ్ఎం శ్రీవాణి, సమన్వయకర్త వెంకటసిద్ధులు తెలిపారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని వినియోగదారుల హక్కులు అనే అంశంపై చిత్తూరు పీవీకేఎన్ కళాశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో వినియోగదారుల ఫోరం నిర్వహించిన ఈ పోటీల్లో కల్లూరు హైస్కూలుకు చెందిన కుష్నిహాజ్‌కు వ్యాసరచనలో ద్వితీయ బహుమతి, వక్తృత్వ పోటీల్లో అబ్దుల్ సలామత్‌కు ద్వితీయ, వ్యాసరచనలో తృతీయ బహుమతులు వచ్చాయని పేర్కొన్నారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు జడ్జి సలీమ్ విద్యార్థులకు నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం


పైప్‌లైన్ వేస్తున్న సిబ్బంది

సదుం: స్థానిక కాలేజీ రోడ్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించినట్లు సర్పంచ్ ఉషారాణి మంగళవారం తెలిపారు. గతంలో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఈనేపథ్యంలో సొంత నిధులు వెచ్చించి నూతన పైప్‌లైన్ వేసి, సమస్యను పరిష్కరించామని ఆమె పేర్కొన్నారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అధిక వడ్డీతో డిపాజిట్ల సేకరణ


మాట్లాడుతున్న మేనేజర్ సుధారాణి

పుంగనూరు: డీసీసీ బ్యాంకులో అధిక వడ్డీలు చెల్లిస్తూ డిపాజిట్ల సేకరణ చేపడుతున్నట్లు మేనేజర్ రాధారాణి తెలిపారు. మంగళవారం బ్యాంకులో డిపాజిట్ల సేకరణపై యూనియన్ ప్రతినిధులు రవికుమార్, రఘుబాబు, గంగిరెడ్డి ఆదేశాల మేరకు 28వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. యూనియన్ కార్యదర్శి రెడ్డెప్ప, అధికారులు శ్రీకాంత్, శ్రీనివాసులు, శ్రీవిద్య, ఆశయ, అమృత, రవి కుమార్, పార్వతి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నాగరాజు

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాలల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో చైర్మన్ బీసీ నాగరాజు కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. మందిరంలో ప్రార్థనలు చేశారు. అనంతరం బీసీ నాగరాజు మాట్లాడుతూ సర్వమతాలు ఒక్కటేనని, కులమతాలకు అతీతంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవచ్చన్నారు. కళాశాలలో చదువుతున్న క్రైస్తవ విద్యార్థులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, పీఆర్‌ఓ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

పాము కాటుకు గురైన మహిళ

పుంగనూరు: మండలంలోని గిరిజాపురానికి చెందిన ఆదిలక్ష్మి(43) మంగళవారం పాముకాటుకు గురైంది. పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా పాము కాటుకు వేసింది. ఈవిషయాన్ని ఆమె కుటుంబసభ్యులకు చెప్పడంతో వెంటనే వారు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్ట్

రామకుప్పం: మండలంలోని కృష్ణరాజపురం సమీపంలోని మామిడి తోటలో మంగళవారం పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రామకుప్పం పోలీసులు తెలిపారు.

ఆహా ఏమిరుచి.. తినరా మైమరచి

హైవేల్లో సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వారిని దృష్టిలో పెట్టుకొని హైవే సైడ్ ఫుడ్ ట్రక్కుల టిఫిన్ సెంటర్లు, మొబైల్ క్యాంటీన్ల వ్యాపారం ఇప్పుడు జోరందుకుంది. ఇప్పటిదాకా బెంగళూరు నుంచి కేఆర్ పురం, హొసకోట, కోలార్ దాకా హైవేపై ఎక్కువగా ఫుడ్ ట్రక్కులు కనిపించేవి. వీరిని చూసి ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. మన రాష్ట్ర సరిహద్దు నుంచి నంగళి, పలమనేరు, బంగారుపాళెం, చిత్తూరు బైపాస్‌ల మీదుగా తిరుపతికి ముందు చంద్రగిరి దాకా ఈ వ్యాపారాలు సాగుతున్నాయి. హైవేలో చాలా వరకు వాహనాలు పట్టణాల్లోకి వెళ్లకుండా బైపాస్‌లోనే వెళుతుంటాయి. ఎంచక్కా వాహనాలను పక్కన నిలిపి పది నిమిషాల్లో కావాల్సిన టిఫిన్ చేసి వెళ్లే సౌలభ్యం ప్రజలకు చిక్కింది. వీటి కారణంగా చిరు వ్యాపారులకు జీవనోపాధి లభిస్తోంది. – పలమనేరు


హైవేలో వెలిసిన ఫుడ్ ట్రక్ టిఫిన్ సెంటర్లు



- హైవేలో జోరందుకున్న ఫుడ్ ట్రక్ టిఫిన్లు!
- బెంగళూరు శివార్లలో చూసి వెలుస్తున్న వైనం
- టిఫిన్లు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకే
- భోజనం, బిరియానీ మధ్యాహ్నం మాత్రమే
- బెంగళూరు నుంచి తిరుపతి దాకా 50 వరకు ట్రక్కులు

సంప్రదాయ గ్రామీణ ఆహారంపై మక్కువ...

సాధారణంగా పట్టణాలు, నగరాల్లో ఉండేవారు జంక్ ఫుడ్స్‌కు అలవాటు పడిఉంటారు. ఇక్కడి ఫుడ్ ట్రక్కుల్లో మెత్తటి ఇడ్లి, దానికి మూడు రకాల చట్నీలు, సాంబార్, ఉద్ది వడ, మసాల వడ, నాలుగైదు రకాల దోసెలు, లెమన్‌రైస్, వెజిటబుల్ రైస్ ఎక్కువగా పెడుతున్నారు. వేరుశనగ చట్నీ, అలసంద గింజల చారు, కంది, పితికిపప్పులాంటివి సీజన్ బట్టి టిఫిన్లకు కాంబినేషన్‌గా పెట్టారు. రుచికరంగా ఉండడంతో సిటీ వాసులు తెగబడి ఈ టిఫిన్లను ఎంతో ఇష్టంగా తింటున్నారు. అక్కడికక్కడే వండి తాజా ఫుడ్‌ను ఇస్తున్నారు. తిన్నోళ్లు సైతం సంతృప్తిని వ్యక్తం చేస్తూ పలువురికి చెపుతుండడంతో రోడ్డు పక్కన టిఫిన్ బండ్ల వ్యాపారాలు జోరందుకున్నాయి.

పేదల కడుపునింపుతున్నాయి..

హైవేలో వెళ్లే వాహనదారులే కాకుండా లారీ డ్రైవర్లు, ఆయా ప్రాంతాల్లోని కూలీలకు సైతం ఇవి కడుపునింపుతున్నాయి. ధరలు కూడా తక్కువగానే ఉండడంతో పేదలకు సౌకర్యంగా మారింది. మరికొందరు ఇళ్ల వద్దే బిరియానీ తయారు చేసుకొని మారుతి ఓమిని వాహనాల్లో పెట్టుకుని హైవేలో వాటిని నిర్ణయించుకున్న ప్రదేశాల్లో కేవలం మధ్యాహ్నం 12 నుంచి 2 దాకా విక్రయాలు చేస్తున్నారు. సాధారణంగా హోటల్‌లో ఓ బిరియానీ రూ.వందకు పైమాటే. కానీ వీరి వద్ద కేవలం రూ.60కే దొరుకుతోంది. హాఫ్ బిరియానీ అయితే రూ.30 మాత్రమే. మరి కొందరు కేవలం రాగి ముద్ద, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చట్నీలను రూ.30కే అమ్ముతున్నారు. దీంతో ఉన్నవారు, లేనివారనే తేడా లేకుండా జనం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం బిరియానీ, ఆహా ఏమిరుచి తినరా మైమరిచి అంటున్నారు.

పాత ఆటోలు, మినీ టెంపోలను కొని డిజైన్ చేస్తున్నారు..



బెంగళూరులో తయారు చేసిన ఫుడ్ ట్రక్కులు రూ.70 వేల నుంచి రూ.2లక్షల దాకా విక్రయిస్తున్నారు. ఇవిగాక కొందరు, ఆటోలు, టెంపోలను సైతం అక్కడికి తీసుకెళితే వారు కిచెన్ తోపాటు ఇతరత్రాలను డిజైన్ చేసి ఇస్తున్నారు. వారి వారి వ్యాపారాలను బట్టి రోజుకు రూ.3వేల నుంచి రూ.15వేల దాకా వ్యాపారాలు సాగుతున్నట్లు సమాచారం. ఇందులో ఆదాయం బాగుండడంతో ఓ బండిని పెట్టిన నిర్వాహకులు రెండు, మూడు బండ్లను హైవేలో వేర్వేరు చోట్ల ఏర్పాటు చేస్తున్నారంటే వీటి డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

రుచి ఉంటే బాగా జరుగుతుంది..



హైవేలో వ్యాపారం చేయాలంటే రుచి బాగుండాలి. దీంతో ఓసారి తిన్నవాళ్లు బాగుందబ్బా అని చెప్పి మళ్లీ మన వద్దకే రావాలి. అలా శుచిగా, రుచిగా ఇస్తే మౌత్ పబ్లిసిటీతో మన వ్యాపారం బాగుంటుంది. బండ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అక్కడికక్కడే వండి తాజాగా వేడిగా అందించాలి. వంటపని వాళ్ల డిమాండ్ మినహా వ్యాపారం దగ్గరుండి చేసుకుంటే బాగుంటుంది.

రెడ్డిప్రసాద్, ఫుడ్ ట్రక్ నిర్వాహకుడు, నాలుగురోడ్లు

రుచిగా ఉంటాయనే తింటాం...



మేము వారానికి ఒకసారి బెంగళూరు నుంచి మా సొంతూరికి కార్లో వెళుతుంటాం. ఎక్కడ బాగుంటుందో తెలుసుకున్నాం. మేము వచ్చే సమయాన్ని బట్టి ఆయా చోట్ల నిలిపి తిని వెళుతుంటాం. సిటీలో టైమ్ వృథా. అందుకే ఇక్కడ రుచిగా ఉండడంతో ఇష్టంగా తింటుంటాం.

కిశోర్‌కుమార్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్, బెంగళూరు

ప్రతి రైతుకు ఐడీ నంబర్

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి రైతుకు ప్రత్యేక ఐడీ నంబర్లు కేటాయిస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐడీ నంబర్ల నమోదు కార్యక్రమాన్ని రైతుసేవా కేంద్రాల్లో చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులందరికి జనవరి 21లోపు ఐడీ నంబర్లు కేటాయిస్తామన్నారు. రైతులందరూ నమోదు చేసుకుని నంబర్లు పొందాలని సూచించారు.

ద్రవిడ వర్సిటీలో స్క్రాప్ మెటీరియల్ వేలం

కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయంలో స్క్రాప్ మెటీరియల్స్ వేలం వేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్‌కుమార్ తెలిపారు. కొనుగోలుదారులు స్వయంగా సంప్రదించి, మెటీరియల్ పరిశీలించి ద్రావిడ విశ్వవిద్యాలయ నమూనా కొటేషన్‌ను లిఖితపూర్వకంగా నింపి సీల్డ్ కవర్ ద్వారా ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల్లోపు రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు వర్సిటీ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పీర్ల మాన్యం భూములపై విచారణ

పుంగనూరు: మండలంలోని పీర్ల మాన్యం భూముల దురాక్రమణపై తహసీల్దార్ రాము మంగళవారం విచారణ చేశారు. సర్వే నంబర్: 43/1లో 3.51 ఎకరాల భూమిని కొంత మంది రికార్డులు మార్చి ఆక్రమించుకోవడంపై సున్నిఅంజుమన్ కమిటీ నేతలు కరీముల్లా, బాబుల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ విచారణ ప్రారంభించారు. భూములు అన్యాక్రాంతంపై విచారణ చేసి, చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రూ.2 లక్షల ఆస్తి నష్టం

పుంగనూరు: పట్టణ సమీపంలోని యూఎస్ఆర్ సర్కిల్‌లో గల పార్థు బేకరిలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. సమాచారం తెలిసిన వెంటనే అగ్నిమాపకశాఖాధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో బేకరి వస్తువులు, ఫ్రిడ్జిలు, ఫర్నిచర్, తదితర వస్తువులు కాలిపోయాయి. దీనిపై బేకరి యజమాని తనకు సమీపంలోని వ్యాపారులే ఈ అగ్నిప్రమాదానికి కారణమై ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి


అర్హులకు పత్రాలను అందజేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

రామకుప్పం: విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని కడ పీడీ వికాస్ మర్మత్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం ఏఎల్ఐఎంసీఓ సంస్థ సౌజన్యంతో రామకుప్పం, శాంతిపురం మండలాలకు చెందిన వృద్ధులు, వికలాంగుల సహాయార్థం పరికరాల గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన వైద్యులు దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తిస్తారన్నారు. సదరం క్యాంపులను త్వరలోనే నిర్వహించి అర్హులకు వికలాంగుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసి పెన్షన్ అందించే కార్యక్రమం చేపడుతామన్నారు. అనంతరం శిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఆయన పరిశీలించారు. ఈ శిబిరంలో మొత్తం 734 మంది హాజరు కాగా 680 మందిని అర్హులుగా గుర్తించినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ తెలిపారు. 45 రోజుల్లో అర్హులకు సహాయ పరికరాలు అందజేస్తామన్నారు. వారి మొబైల్ నంబర్లకు మెసేజ్‌లు పంపిస్తామని తెలిపారు. కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజు, రామకుప్పం, శాంతిపురం తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: గ్రామీణులు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.మురళి కోరారు. మంగళవారం అప్పినపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం శంకర్రాయలపేట పూలే బాలికల పాఠశాల, శివాడి అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ వనజ, ఏఎన్ఎం పుణ్యవతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల నిరసనకు తరలిరండి


పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు

కుప్పం: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం ఎమ్మెల్సీ భరత్ ఈనెల 27న విద్యుత్ చార్జీలు పెంపుపై నిర్వహించే ధర్నా వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు కుప్పం నియోజకవర్గంలో విద్యుత్ చార్జీలు పెంచడంపై నిరసన తెలుపుతున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో మహాకూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో విద్యుత్ చార్జీలు భారీగా పెంచిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కరెంటు చార్జీలు పెంచేది లేదని అవసరమైతే చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీలను చంద్రబాబు విస్మరించారని అన్నారు. వినియోగదారులే కరెంటు అమ్మేలా చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు అధికారం వచ్చిన తరువాత చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని అన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కోదండరెడ్డి, మోహన్‌రావు, భాగ్యరాజ్, మురుగేష్, శీను, రమేష్, గణపతి పాల్గొన్నారు.

పీఈఎస్‌లో ఉచిత వైద్యశిబిరం

గుడుపల్లె: పీఈఎస్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం తెలిపారు. సాధారణ వైద్యం, చిన్న పిల్లల సమస్యలు, జనరల్ సర్జరీ ఎముకలు, కీళ్లు ప్రసూతి, స్త్రీగర్భకోశ విభాగాల్లో వివిధ భాగాలకు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. స్కానింగ్, డెలివరీ చార్జీలు ఆపరేషన్‌లతో ఉచితంగా నిర్వహిస్తామని ఈసందర్భంగా ఆయన. ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పడ్డారని లేపామో..అంతే సంగతులు

-స్మార్ట్‌ఫోన్ల చోరీలో కొత్త ప్రయోగం చేస్తున్న దొంగలు

పలమనేరు: అయ్యో పాపమంటే ఆరు నెలల శాపం తప్పదన్నట్లు రోడ్డుపై బైక్‌లో కిందపడ్డారని వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తే ఇక అంతేసంగతులు. మన వెనకనున్న మరో ఇద్దరు మన జేబుల్లోని స్మార్ట్‌ఫోన్లు, పర్సులను మాయం చేసేస్తారు. ఇలాంటి ఘటన పలమనేరులో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన న్యాయవాది భాస్కర్ ఈనెల 17న బైక్‌ను సర్వీసు కిచ్చి ఇంటికి వెళ్లేందుకు అంబేడ్కర్ సర్కిల్‌లో ఉండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆయన ముందు పడ్డారు. దీంతో అతను వారిని పైకిలేపి దెబ్బలేమైనా తగిలాయా అని అడగ్గా లేదని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంతసేపటికీ చూస్తే తన జేబులోని రూ.1.30లక్షల విలువైన మొబైల్ కనిపించలేదు. వెంటనే ఆయన కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందికి తెలిపారు. వారు అక్కడి పుటేజీలను పరిశీలించగా రెండు బైక్‌లపై నలుగురు యువకులు అక్కడ లాయర్‌ను గమనించారు. ఆయన ఫోన్‌లో మాట్లాడుతుండగా ఖరీదైన ఫోనుగా గుర్తించారు. దీంతో పక్కాగా స్కెచ్ వేసి ముందుగా ఇద్దరు పల్సర్ బైక్‌పై ఆయన ముందు పడ్డారు. వారిని ఆయన లేపుతుండగా వెనుకనున్న మరో ఇద్దరు సాయం చేస్తున్నట్టుగానే లాయర్ జేబులోని సెల్‌ను చోరీ చేసి ముందు బైక్‌పై వెళ్లిన వారితోపాటే వెళ్లినట్టు పుటేజీలో తేలింది. పోలీసులు వెంటనే వివిధ పోలీస్‌స్టేషన్లకు వివరాలను అందించి అప్రమత్తం చేశారు. మరోవైపు బాధితుడు సైతం కొందరి లాయర్లతో కలసి కారులో వారు వెళ్లిన మార్గంలో తన ఫోన్ ఆన్‌లో ఉండడంతో వేరే ఫోన్ సాయంతో జీపీఆర్ఎస్ ఆధారంగా వీరిని ఫాలో చేశారు. వీరు చౌడేపల్లి మీదుగా సోమలకు వెళ్లారు. అక్కడ పోలీసులను చూసి మరో మార్గంలో కలకడ మీదుగా రాయచోటి మార్గంలో సంబేపల్లి వైపు వెళ్లారు. అక్కడ బాధితుని ఫోన్ స్విచ్‌ఆఫ్ కావడంతో చేసేది ఏమీలేక తిరుగుముఖం పట్టారు. పోలీసులు సాంకేతికంగా చూడగా వారు సంబేపల్లి నుంచి ఓబనపల్లికి వెళ్లినట్టు తేలింది. దీంతో ఇక్కడి పోలీసులు చిత్తూరు పోలీసుల ద్వారా ఓబనపల్లిలోని దొంగలను గుర్తించి విచారించగా చోరీ చేసింది తామేనని అయితే ఆ ఫోన్‌ను సంబేపల్లి వద్ద పడేశామని చెప్పారట. వారం క్రితం ఇదే తరహాలో స్థానిక కోర్టు వద్ద ఇద్దరు యువకులు బైక్‌పై నుంచి కిందపడ్డారు. దీంతో అక్కడ రోడ్ క్రాస్ చేస్తున్న మరో న్యాయవాది క్రిష్ణప్ప వారిని కాపేడేందుకు వెళ్లి పైకి లేపుతుండగా ఆయన జేబులోని స్మార్ట్ ఫోన్ చోరీకి గురైంది. ఏదేమైనా చోరీలు ఇలా కూడా ఉంటాయా అని జనం విస్తుబోతున్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెద్దపంజాణి: మండలంలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం కరసనపల్లి పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 54 అర్జీలు వచ్చినట్లు ఆయన చెప్పారు.

చౌదేపల్లిలో..

చౌదేపల్లి: కాటిపేరి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 32 అర్జీలు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ మాధవి తెలిపారు. సర్వేయర్ గుణశేఖర్, ఆర్ఐ భారతి పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: రైతు శ్రేయస్సు కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సీతారాం పేర్కొన్నారు. గుడుపల్లె, చీకటిపల్లె గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.


ఆర్ఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా కుమార్



పలమనేరు: రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పలమనేరుకు చెందిన ఉపాధ్యాయుడు ఏఆర్ కుమార్ నియమితులయ్యారు. ఆమేరకు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు రామచంద్ర నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు మంగళవారం అందించినట్లు తెలిపారు. జిల్లాలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి తాను చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు తాలుకా స్థాయిలో సంఘాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధం

- పలమనేరులో 164 ఏళ్ల పురాతన సీఎస్ఐ చర్చి
- 1860లో చర్చిని నిర్మించిన స్కడ్డర్ ఫ్యామిలీ
- నేడు క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం


ముస్తాబైన పలమనేరు సీఎస్ఐ చర్చి

పలమనేరు: పట్టణానికి తలమానికంగా నిలిచి పట్టణ నడిబొడ్డులో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకొని వున్న సీఎస్ఐ చర్చికి 164 ఏళ్ల చరిత్ర ఉంది. చర్చిని 1860లో చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా వేలూర్ డయాసిస్ అధికారులు, అమెరికన్ అర్కాట్ మిషన్ ఆధ్వర్యంలో స్కడ్డర్ ఫ్యామిలీ దీన్ని నిర్మించింది. పలమనేరు నియోజకవర్గంలో ప్రాచీనమైన చర్చిగా దీనికి పేరుంది. ఈ చర్చి పరిధిలో 500 కుటుంబాల క్రైస్తవులు ప్రార్థనలు చేస్తుంటారు. వీరికి సంబంధించి వంద ఎకరాల బంగ్లాతో పాటు పలు భవంతులున్నాయి. నేడు క్రిస్మస్ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో క్రిస్మస్ ట్రీకి నక్షత్రాలను అమర్చి సౌందర్యంగా తీర్చిదిద్దారు. అదేవిధంగా పట్టణంలోని గుడియాత్తం రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన సీఎస్ఐ చర్చి వేడుకలకు సిద్ధమైంది. సీఎస్ఐ సంఘ సొంత నిధులతో వేలాది మంది ప్రార్థనలు చేసేలా విశాలమైన భవనంలో చర్చిని నిర్మించారు. చర్చి భవనంపై 120 అడుగుల శిలువను కట్టారు. నేటి క్రిస్మస్‌కు ఇక్కడ భారీ ఏర్పాట్లను చేశారు. దీంతోపాటు పట్టణంలోని పలు చర్చిలు సైతం నేటి క్రిస్మస్‌కు సర్వాంగసుందరంగా మారాయి.

కుప్పంలో..

కుప్పం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరణ చేశారు. పట్టణంలోని కొత్తపేట, ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్, బాబూనగర్, శ్రీలంక కాలనీ ప్రాంతాల్లో చర్చిలను విశేషంగా అలంకరించారు. బుధవారం ఉదయం క్రిస్మస్ పర్వదినాన ప్రత్యేక ప్రార్థనలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

సదుంలో..

సదుం: మండల కేంద్రంలోని బేతానియా, మరియ తల్లి మందిరం, గొంగివారిపల్లె డాన్‌బోస్కో, గుండ్లూరువారిపల్లె, నడిగడ్డ, జాండ్రపేట, బూరగమంద ప్రాంతాలలో చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


పలమనేరులోని సీఎస్ఐ చర్చి


కుప్పం: విద్యుద్దీపాల అలంకరణలో చర్చి


సదుం: ముస్తాబైన మరియతల్లి మందిరం

ఐబీఎం నైపుణ్య శిక్షణ

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐబీఎం కంపెనీ వారితో నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించినట్టు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమానికి ఈడీవి.నెట్ వారి తరపున అశ్వినీకుమార్ రీసోర్స్‌పర్సన్‌గా విజయవాడ నుంచి విచ్చేశారని పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులకు ఐబీఎం స్కిల్ బిల్డ్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ కోర్సులు, సర్టిఫికెట్ కోర్సులను వివరించారు. చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.